క్లుప్తంగా

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు శ్రీ గోగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల పాలిట కల్పతరువుగా, కోరిన కోరికలు తీర్చే బంగారు తల్లిగా నిత్య నీరాజనాలు అందుకుంటున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు తరించారు. పూజా కార్యక్రమాను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేత



రేపల్లె రూరల్: గుమ్మడి నాగయ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సబ్‌జైలు, కోర్టు సిబ్బంది సహకారంతో పట్టణంలోని 30 మంది పేద విద్యార్థులకు ఆదివారం స్థానిక గుమ్మడి నాగయ్య సేవా సంస్థ కార్యాలయంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు జీ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదకాకాని: బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రదేశంలో యూనికార్న్ బైక్ పడి ఉంది. రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని విజయవాడ వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే రోడ్డులో బైక్‌పై వెళుతున్న వ్యక్తి అజాగ్రత్తగా నడిపి ఢీ కొనడం కారణంగానే తీవ్రగాయాలై చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ విభాగానికి తరలించారు. తక్కెళ్ళపాడు వీఆర్‌ఏ షేక్ లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్, అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్ 40వ ఇంద్రజాల మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మెజీషియన్స్ ఇంద్రజాల ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం అసోసియేషన్ సభ్యులను దేవాలయ పాలక మండలి సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేవీఆర్, కార్యదర్శి డాక్టర్ ఆర్యల్, డాక్టర్ ఆర్‌ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తెనాలిరూరల్: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఐతా నగర్‌కు చెందిన షేక్ ఆషా(34) ఆదివారం సాయంత్రం తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమెకు తెలిసిన వారితో వివాదం కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

తల్లులను మోసగించిన కూటమి ప్రభుత్వం

- తల్లికి వందనం పేరుతో తల్లులను మోసగించిన కూటమి ప్రభుత్వంపై చీటింగ్ కేసు పెట్టాలి
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- రాజకీయ దురుద్దేశంతో వైఎస్సార్ సీపీ నాయకలపై కేసులు



భట్టిప్రోలులో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు, పక్కన నాయకులు

భట్టిప్రోలు: తల్లికి వందనం పేరుతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై తల్లులు 420 కేసు పెట్టేందుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం భట్టిప్రోలు మాజీ జెడ్పీటీసీ సభ్యులు బందారు కుమారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సూపర్ 6లో భాగంగా ప్రతి ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం కింద రూ. 15 వేలు చొప్పున ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు మాటమార్చి ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామని చెబుతూ నయవంచన చేసిందన్నారు. ఇసుక ఉచితం అంటూ ప్రభుత్వం పేదలను దోపిడీ చేస్తుందని విమర్శించారు. రీచ్‌ల వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా పొక్లెయినర్స్ పెట్టించడమే కాక కౌంటర్ల ఏర్పాటు, ఆధార్ కార్డులు ఎందుకని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై 307 కేసును దురుద్దేశం, రాజకీయ కక్షతోనే నమోదు చేశారని పేర్కొన్నారు. గతంలో కోర్టులో హాజరు పరచినప్పుడు రఘురామ కృష్ణంరాజు చెప్పిన మాటలకు ప్రస్తుతం ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు ఏ మాత్రం పొంతన లేదన్నారు. మూడేళ్ల క్రితం ఫిర్యాదు చేస్తే పోలీసులు ఇప్పుడు కేసు నమోదు చేయడం ఏమిటని అన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశం, ద్వేషంతో ఆయన ఫిర్యాదు చేశారని అన్నారు. చంద్రబాబు చేసేవన్నీ మోసాలేనని పదే పదే రుజువు అవుతుందని తెలిపారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండి ఉంటే ఈ పాటికే అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా ఇలా అన్నీ అంది ఉండేవన్నారు.

కులాల మధ్య చిచ్చు పెడుతున్న టీడీపీ నేతలు..

అధికార కండకావరంతో టీడీపీ నేతలు బరితెగిస్తూ ప్రతి గ్రామంలో కులాలను విభజించి దాడులు చేయించి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతుక లేకుండా ఒక పథకం ప్రకారం దాడులు జరుపుతున్నారని తెలిపారు. భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి దగ్ధం చేయగా ప్రజా చైతన్యంతో సంఘటన జరిగిన 24 గంటల లోపు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఎన్‌ఆర్‌ఐలు, ఐటీ మిత్రులు తమ తల్లిదండ్రులు, బంధుమిత్రులకు విన్నపం చేస్తూ మంచికి సహకరించాలని కోరారు. ప్రజలకు తప్పుడు విధానాలు, దోచుకోవడం నేర్పవద్దని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన నెల లోపే ఇసుక, మట్టి మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు.

నియోజకవర్గంలో మండలానికో ఎమ్మెల్యే..

వేమూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రతి మండలంలో ఒక్కో ఎమ్మెల్యేను తయారు చేశారని విమర్శించారు. భట్టిప్రోలులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని గౌడ, రజక, దళిత వర్గాల మధ్య చిచ్చు పెట్టి అక్రమ కేసులు పెట్టించారన్నారు. తన సొంత సామాజిక వర్గమైన ఆర్యవైశ్యులను, దేవాలయాన్ని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పవిత్రమైన దేవాలయంలో రాజకీయ సమావేశాలు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్యవైశ్యులు ఎవరైతే తనకు ఎదురు చెబుతారో వారిని పక్కన పెట్టి తనకు ఇష్టమొచ్చినట్లు దేవాలయ కమిటీలు వేసుకుంటున్నారని దీనికి అడ్డు చెప్పే వారు ఎవరూ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 18 ఏళ్లు దాటిన మహిళకు రూ.1500లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాలు, 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్లు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని అమలు చేయకపోతే ప్రశ్నించడమే కాక కోర్టుకు లాగుతామని అన్నారు.

సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందర రావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, పార్టీ నాయకులు బండారు శ్రీనివాసరావు, వేల్పూరి చిన్నారి, చిలుమూరి రామమోహన్‌రావు, సిరాజుద్దీన్, తబ్రేజ్, వేల్పూరి నాగేశ్వరరావు, మోర్ల కోటేశ్వరరావు, తలకొల యలమంద, కుక్కల భూషణరావు, దావూరి నాగమల్లేశ్వరరావు, గోలి శ్రీనుబాబు, కె. భాస్కర్, కె.నాగరాజు, పీజీ అరణ్‌శాస్త్రి, డొక్కు ప్రకాష్, పప్పుల చిరంజీవి, వసుపులేటి శివ రామప్రసాద్, దాసరి శేషయ్య, మద్దుల రాముడు, తిరువీధుల వెంకటేశ్వర్లు, లాజర్ పాల్గొన్నారు.

వర్షపునీటితో లోతట్టు ప్రాంతాలు జలమయం



పాత స్టేట్ బ్యాంక్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

రేపల్లె రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి విడతల వారీగా కురుస్తున్న జల్లులతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరింది. పట్టణంలోని పలు రహదారులపై వర్షపునీరు నిలబడటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని పలు రహదారులు చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్నాయి. ఆయా ప్రాంతాలలో డ్రైనేజీ సదుపాయం లేకపోవటంతో రోజుల తరబడి నీరు రహదారిపైనే ఉంటోంది. ప్రధానంగా హౌసింగ్ బోర్డు కాలనీ, నిజాంపట్నం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మున్సిపల్ రోడ్డు, 2వవార్డు, 22, 23వ వార్డులలో పలు రహదారులు పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను అధిగమించేందుకు ప్రస్తుత పాలకులు రహదారులను అభివృద్ధి చేయటంతో పాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఆదివారం కురిసిన వర్షంతో రేపల్లె పట్టణంలో 6.4 మిమీ, నగరంలో 3.2 మిమీ, చెరుకుపల్లిలో 3.6 మిమీ, నిజాంపట్నంలో 11.8 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

చేనేత సొసైటీలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. బాలాజీ

భట్టిప్రోలు: చేనేత సొసైటీలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 3 రోజుల క్రితం నెల్లూరులో జరిగిన ఏపీ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశంలో చేనేత కార్మికులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. పాలక వర్గాల ఎన్నికలు జరగక పోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని, కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. జౌళి శాఖను, చేనేతను విడదీసి రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని, సొసైటీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నేతన్నలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహం, వర్క్‌షెడ్ నిర్మించి ఇవ్వాలని, సిల్క్ రాయితీని రూ.3 వేలకు పెంచాలని, నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని తదితర సమస్యల పరిష్కారానికై ఆ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు కె.రామ కోటేశ్వరరావు, జి.లక్ష్మి, కేవీ మోహన్‌రావు, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ కొలుపులు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మవారు



కనక తప్పెట్లతో అమ్మవారి సన్నిధికి వెళుతున్న భక్తులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో శ్రీ గంగమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలి వారి వంశీకుల అమ్మవారైన గంగమ్మను భక్తి శ్రద్ధలతో కొలుస్తుంటారు. అమ్మవారికి నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కొలుపులలో ఆబాలగోపాలం పాల్గొని కనక తప్పెట్లతో అమ్మవారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలి వారి వంశీకుల ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు ఆడపడుచులు, అల్లుళ్లు, స్నేహితులు, బంధువులతో కళకళలాడింది.

కాలువలో పూడిక.. సాగునీరు పారక..!

- సాగునీటి కాలువలు, డ్రైనేజీలలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడ
- కాలువల పూడికతీత లేక పంట పొలాల్లో నిలిచిపోయిన వర్షపునీరు
- పూడికతీత చేపట్టాలన్న ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
- అధికారుల ఉదాసీనతపై అన్నదాతల ఆవేదన



పెరవలి గంగోలు డ్రైనేజీలో నిలిచిపోయిన గుర్రపుడెక్క



కూచిపూడి ఇరిగేషన్ కాలువలో నిలిచిన తూటికాడ

వేమూరు: డ్రైనేజీ, సాగునీటి కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపులో ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల నుంచి భారీగా కురుస్తున్న వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లడం చాలా కష్టంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు డ్రైనేజీ, సాగునీటి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగిస్తే పొలాల్లో నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కాల్వలకు సాగునీరు విడుదల చేసినా కాల్వల్లో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క, తూటికాడ పేరుకుపోవటంతో సాగునీరు పారడం లేదన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

నియోజకవర్గంలోని చివరి భూములకు సైతం సాగునీరు అందేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకొని డ్రైనేజీ, సాగునీటి కాల్వల్లో పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూటి కాడ తొలగింపుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు ఇచ్చారు. అయితే ఎమ్మెల్యే మాటలను సైతం లెక్క చేయకుండా ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు సాగునీటి కాల్వల్లో గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపునకు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయానికి దగ్గరలోనే తూటికాడ ఉన్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. వేమూరు మండలంలోని గంగోలు డ్రేనేజీలో సైతం గుర్రపు డెక్క పెద్ద ఎత్తున పేరుకు పోయింది.

> **సాగునీరు పారేలా చర్యలు చేపడతాం**
>
> గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపునకు టెండర్లు పూర్తయ్యాయి. సోమ లేదా మంగళ వారాల్లో టెండర్లు వేస్తారు. ప్రక్రియ పూర్తి కాగానే టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ల ద్వారా కాల్వల్లో గుర్రపు డెక్క, తూటికాడ తొలగించి సాగునీరు పారేలా చర్యలు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.
>
> –రాంబాబు, ఏఈ, నీటిపారుదలశాఖ.

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు

భట్టిప్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వేమూరు నియోజకవర్గంలో గత 2 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం అమృతలూరులో 9.4, చుండూరులో 7.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నగరం: మండలంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకై ఏర్పాటు చేయనున్న ట్రాన్స్‌ఫార్మర్ పనుల నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండలంలోని లుక్కావారిపాలెం పరిసర ప్రాంత గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ సాయి బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి కార్యదర్శిగా భాస్కరరావు నియామకం

వరహాపురం(వేమూరు): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జనరల్ సెక్రటరీగా యల్లమాటి భాస్కరరావు నియమితులయ్యారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి అధ్యక్షుడు బుల్లా రాజారావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకొని ప్రకటించడం జరిగిందన్నారు.

జీపీఎస్ జీవోను వెంటనే రద్దు చేయాలి

ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్



భట్టిప్రోలు: ఆర్థికశాఖ జీపీఎస్‌పై జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని జిల్లా ఏపీ సీపీఎస్‌ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ ఆదివారం డిమాండ్ చేశారు. ఉద్యోగులు వ్యతిరేకించిన జీపీఎస్‌పై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీపీఎస్ కంటే ఆమోదయోగ్యమైన ఓపీఎస్ అమలు చేయడానికి ఒక ఏడాదిలో కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారని గుర్తు చేశారు. ఈ నెల 12న జీపీఎస్‌ను అమలు చేస్తూ ఆర్థిక శాఖ నుంచి ఆదేశాలు జారీ కావడంతో సీపీఎస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి నాదెండ్లకు ఆర్టీసీ కార్మికుల వినతి



మంత్రి మనోహర్‌ను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

తెనాలిరూరల్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. పపట్టణంలోని బోస్ రోడ్డులో ఉన్న మంత్రి కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం రాత్రి మంత్రికి సమస్యలను విన్నవించారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానంలో ఆర్టీసీలో 7,300 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నామన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

నైపుణ్యాల మెరుగుకు ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులతో రిసోర్స్ పర్సన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల ఉపాధ్యాయులకు విజయవాడలోని సీబీఎస్‌ఈ ప్రాంతీయ కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా వివా స్కూల్ ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఎస్.ఉమా శ్రీనివాసరావు వ్యవహరించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించడానికి బ్లూమ్స్ టాక్సానమి పద్ధతిలో అర్కా, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, మల్టిపుల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులు మార్చుకునేలా, సీబీఎస్‌ఈ సీఓఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. తమ విలువైన సమయాన్ని ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చేందుకు కేటాయించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

ప్రతిభావంతులకు చేయూతనివ్వాలి

నగరంపాలెం: ప్రతి విద్యార్థి విద్య ద్వారా ఉన్నతంగా ఎదగాలని బొందిలి సంక్షేమ సేవ సమాజ్ అధ్యక్షుడు రాథోడ్ సుజాన్‌సింగ్ అన్నారు. పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన బొందిలి విద్యార్థులు 120 మందికి ఆదివారం జీటీ రోడ్డులోని శ్రీ సదాశివ టైపు ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా నోట్ పుస్తకాలు, ప్రోత్సాహక నగదు అందించారు. ఈ సందర్భంగా రాథోడ్ సుజాన్ సింగ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. తద్వారా మరి కొంతమంది ప్రతిభ ఉన్న విద్యార్థులకు చేయూతనందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే విశ్రాంత ఉద్యోగి రామకృష్ణ సింగ్, సమాజ్ కార్యదర్శి శ్రీనివాససింగ్, సంయుక్త కార్యదర్శి నిర్మల్ సింగ్, సభ్యులు నరేంద్రనాథ్ సింగ్, రూప్‌సింగ్, బాలాజీసింగ్, శంకర్ సింగ్, లాలా ప్రసాద్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలను అశ్రద్ధ చేయడమే అనారోగ్యాలకు మూలం



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

గుంటూరు రూరల్: మన పూర్వీకుల ఆహార అలవాటులైన చిరుధాన్యాలను పక్కకు నెట్టి బియ్యం, గోధుమలు లాంటివి ఉపయోగించేలా నేటి మన జీవనశైలి మారిందని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన సిరిధాన్యాలతో జీవనసిరి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విదేశీ ఆహారపు అలవాట్ల ఫలితమే నేడు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య అనారోగ్యమని చెప్పారు. ప్రజలు అవసరాలను పక్కకు నెట్టి అనుకరణలకు ప్రాధాన్యతనివ్వడానికి బానిసలైపోయారన్నారు. ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటివి అలవాటు చేసుకోవడంతో పాటు కృత్రిమ సౌందర్య సాధనాలను విపరీతంగా ఉపయోగించడం లాంటివి విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని అందుకు కారణం మన ఆహారపు అలవాట్లేనని చెప్పారు. గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ఈ సమస్యకు సిరిధాన్యాలు, కషాయాలే పరిష్కారమని అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో సిరిధాన్యాలతో జీవన సిరి అనే కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషకరమన్నారు. 150 ఏళ్ల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని, కానీ నేడు దేశవ్యాప్తంగా ప్రతి 100 మందిలో 20–25 మంది మధుమేహంతో బాధపడుతున్నారన్నారు. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10 నుంచి 15 మంది బుద్ధి మాంద్యంతో పుడుతున్నారని వివరించారు. ఈ సమస్యలన్నిటికి పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణమని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సిరి ధాన్యాలతో పాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్లలో, శుద్ధిచేసిన ఆహారాలను మానేయాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి రోగాలను నయం చేసే శక్తి సిరిధాన్యాలకు, కషాయాలకు ఉందని వివరించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.